క్లుప్తంగా

నిరుపేదలకు ఆసరా జగనన్న పెళ్లి కానుక



పెళ్లి కానుక పథకం లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న దృశ్యం

గొలుగొండ: జగనన్న పెళ్లి కానుక పథకం ఎంతో మంది నిరుపేదలకు ఆసరాగా నిలుస్తుందని వైస్ ఎంపీపీ జక్కు నాగమణి తెలిపారు. జోగుంపేటలో ఇటీవల వివాహమైన ఐదు జంటలకు సంబంధించి వధువుల కుటుంబ సభ్యులకు పథకం నమోదు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పంచాడ నాగరాజు, కశ్లింపూడి చిన్న, జక్కు చిన్న, జమీల్, వీఆర్వో గోవర్ధన్ పాల్గొన్నారు.

నెరవేరిన సొంతగూడు కల



గృహప్రవేశం చేస్తున్న హరిబాబు

మాకవరపాలెం: జగనన్న కాలనీలతో పేదలకు సొంతగూడు కల నెరవేరిందని తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. తామరంలో జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తి చేసిన కోనేటి లక్ష్మమ్మ ఇంటికి ఆయన శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ సొంత గూడు లేక ఎందరో పేదలు ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పేదలకు స్థలాలిచ్చి, నిర్మాణాలకు నిధులు ఇవ్వడంతో సొంతగూడు కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

'ఉపాధి పనిదినాలు 200 రోజులకు పెంచాలి'



వారాడలో వినతిపత్రాన్ని అందిస్తున్న నాయినిబాబు, దేముడు

కె.కోటపాడు: ప్రస్తుతం ఉపాధి వేతనదారులకు అమలు చేస్తున్న వంద రోజుల పనిదినాలను 200 రోజులకు పెంచాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు గండి నాయినిబాబు కోరారు. వారాడ, సింగన్నదొరపాలెం, ఎ.కోడూరు గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు పార్టీ నాయకుడు దేముడుతో కలిసి వినతిపత్రాలను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్డుదారులకు 14 రకాల నిత్యావసర సరుకులందించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. పార్టీ నాయకులు వనుము సూర్యనారాయణ, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



జానకీరాంపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జానకీరాంపురం, శరభవరం గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా సేకరించిన వివిధ పత్రాలు, ఆవుపేడ, మూత్రం తదితర వాటితో జీవామృతం తయారీపై మండల ఇన్‌చార్జి నిర్మల అవగాహన కల్పించారు. వాటి వినియోగం, మేలుపై వివరించారు. రసాయనిక ఎరువులకు ప్రకృతి ఎరువులకు మధ్య తేడా, దిగుబడుల గురించి కూలంకషంగా వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సిబ్బంది మోదినాయుడు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

చీడికాడ: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి శుక్రవారం చీడికాడలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

మిగిలిన అర్హులకు పింఛన్లు అందిస్తాం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ భరోసా
- ఇంటింటికీ వెళ్లి నూతన పింఛన్ల పంపిణీ



బుచ్చెయ్యపేట: కేపీ అగ్రహారంలో ఇంటింటికి తిరిగి పింఛన్లు అందిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: సాంకేతిక కారణాలతో కొంత మందికి ఈ నెలలో పింఛన్లు మంజూరు కాలేదని, వారికి వచ్చే నెలలో మంజూరయ్యేలా చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ భరోసా ఇచ్చారు. కేపీ అగ్రహారంలో కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. నెల రోజుల క్రితం ఇక్కడ గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో అర్హత ఉన్నా పింఛన్లు రాలేదని పలువురు ధర్మశ్రీ ఎదుట వాపోయారు. దీనిపై స్పందించి వారికి పింఛన్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. దాంతో ఈ నెల కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఎంపీటీసీ దేవర అప్పారావు, ఉప సర్పంచ్ ముసలినాయుడు పాల్గొన్నారు.



దేవరాపల్లి: వేచలంలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శరాలినాయుడు, రమణ

రావికమతం: మండలానికి నూతనంగా మంజూరైన పింఛన్లను గ్రామ గ్రామాన శుక్రవారం సంబరంగా పంపిణీ చేశారు. మండలంలో సామాజిక పింఛన్లు 14 వేల వరకు ఉన్నాయి. వీటితోపాటు తాజాగా మండలానికి మంజూరైన 278 పింఛన్లను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పంపిణీ చేశారు. రావికమతం, తోటకూరపాలెంలో ఎంపీపీ పైల రాజు, కొత్తకోటలో జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి అందజేశారు.

పండగలా నూతన పింఛన్ల పంపిణీ

దేవరాపల్లి: మండలానికి నూతనంగా మంజూరైన 133 పింఛన్లను పండగ వాతావరణంలో శుక్రవారం పంపిణీ చేశారు. వీటిని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. వేచలంలో సర్పంచ్ నాగిరెడ్డి శరాలినాయుడు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి జి.వి. రమణ అందజేశారు. ములకలాపల్లిలో సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ, ఎంపీటీసీ మజ్జి దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె కొండలరావు, మజ్జి రాజు పంపిణీ చేశారు. పింఛన్లు మంజూరు చేసిన సిఎం జగన్, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



దేవరాపల్లి: ములకలాపల్లిలో నూతన పింఛన్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కె.కోటపాడు: ఎ.కోడూరు గ్రామ సచివాలయం పరిధిలో కొత్తగా 18 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని ఎంపీటీసీ లెక్కల గౌతమి, సచివాలయ కన్వీనర్లు బొడ్డు ప్రకాశమ్మ, బొడ్డు శ్రీను, ఉప సర్పంచ్ దొగ్గ దేముళ్లు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలనను అందిస్తున్నట్లు ఎంపీటీసీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లెక్కల శంకరరావు, ఆర్బీకే కన్వీనర్ దొగ్గ సత్యం, యడ్ల పాపునాయుడు, కె.నానాజీ పాల్గొన్నారు.

80 శాతం కొత్త పింఛన్లు

గొలుగొండ: మండలంలో 27 పంచాయతీల్లో కొత్తగా మంజూరైన 180 పింఛన్లలో శుక్రవారం 80 శాతం పంపిణీ చేశారు. వలంటీర్లు తెల్లవారే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. పాత పింఛన్లు సైతం పంపిణీ చేశామని ఎంపీడీవో డేవిడ్‌రాజు తెలిపారు.



నాతవరం: చమ్మచింతలో కొత్త పింఛను అందజేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనాగగోపి



కె.కోటపాడు: లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎంపీటీసీ గౌతమి

సర్పంచ్‌లు కసిపల్లి బుజ్జి, పోలిరెడ్డి రాజుబాబు, బిడిజాన రాజేశ్వరి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాతవరం: చమ్మచింతలో కొత్తగా మంజూరైన పింఛన్లను వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మీరంతా మరలా వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఏ విధంగా అందాయో చూశారని, ఇప్పుడు ఆ పార్టీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, నాతవరం పీఏసీఎస్ డైరెక్టరు అప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

చోడవరం రూరల్: బెన్నవోలులో సర్పంచ్ మూడెడ్ల శంకరరావు లబ్ధిదారులకు శుక్రవారం కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ఎప్పటికప్పుడు పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు నిరంతర ప్రక్రియలాగా జగన్ ప్రభుత్వం నిర్వహిస్తుందని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. నాయకులు జంపా నాగేశ్వరరావు, కంతంరెడ్డి రామాంజనేయ, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



గొలుగొండ: కొత్త పింఛన్లు అందిస్తున్న దృశ్యం



రావికమతం: పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



చోడవరం రూరల్: కొత్తగా మంజూరైన వారికి పింఛన్లు అందిస్తున్న సర్పంచ్

పాడి రైతులకు రాయితీపై గడ్డికోత యంత్రాలు



రైతులకు గడ్డికోత యంత్రాలు అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు

చోడవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందించే పశువుల గడ్డి కోత యంత్రాలతో రైతులకు సమయం ఆదా అవుతుందని చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోవాడ పశువుల ఆస్పత్రిలో శుక్రవారం ముగ్గురు పాడి రైతులు బీరా నారాయణరావు, మహాలక్ష్మినాయుడు, జగన్‌లకు గడ్డికోత యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడువాక మాట్లాడుతూ రూ.33,790 విలువ చేసే చాఫ్‌కట్టర్‌ను 40 శాతం సబ్సిడీ కల్పించి రూ.20,388కే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బి.లిఖిత, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బీరా సత్యారావు, నాగేష్, దేముడు పాల్గొన్నారు.

పెద్దేరు ఆయకట్టులో చివరి దశకు వరి నాట్లు



వరినాట్లు వేసిన దృశ్యం

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయం ఎడమ కాలువ పరిధిలో ఖరీఫ్ వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఆయకట్టు పరిధిలో 6,500 ఎకరాలకు గాను ప్రస్తుతం ఆరు వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. వర్షాలు అనుకూలించడంతోపాటు జలాశయంలో పుష్కలంగా సాగు నీరు ఉండటంతో ఖరీఫ్ పంటకు ఢోకాలేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని అవంతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో శుక్రవారం ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. అలా చేసిన నాడే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. తద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించిన వాళ్లమవుతామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ గణేష్, ఫిజికల్ డైరెక్టర్ శివ, అధ్యాపకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్

ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ

నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆదేశం

నర్సీపట్నం: తొలగించిన ఓట్లపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం బీఎల్వోలను ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులతో శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. తప్పొప్పులు లేకుండా పరిపూర్ణమైన ఓటరు జాబితా తయారీకి సమర్థవంతంగా పని చేయాలన్నారు. 2022 జనవరి 6 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు తొలగించిన ఓట్లపై సమగ్ర విచారణ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు. బీఎల్వోలు త్వరతగతిన విచారణ చేసి నివేదికను అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్నాజీరావు, మున్సిపల్ కమిషనర్ కనకారావు పాల్గొన్నారు.



బీఎల్వోలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలిగా రాధ

నాతవరం: మహిళా సమాఖ్య మండల నూతన అధ్యక్షురాలిగా నాతవరానికి చెందిన పోలుపర్తి రాధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అంకంరెడ్డి లక్ష్మి(పి.జగ్గంపేట), కోశాధికారిగా బండారు వరలక్ష్మి(శృంగవరం) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు రాధ మాట్లాడుతూ డ్వాక్రా సభ్యులతో పంచాయతీలో సమావేశాలు నిర్వహించి సంఘాలను మరించి బలోపేతం చేస్తామన్నారు. డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలపై వారిలో చైతన్యం తీసుకువస్తామన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కమిటీని వెలుగు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.



పోలుపర్తి రాధ

పీఏసీఎస్ వార్షికాదాయం రూ.7.65 లక్షలు

చోడవరం రూరల్: సహకార సంఘాల మనుగడ కష్టతరంగా మారిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వడ్డీ రాయితీ సొమ్మును సొసైటీలకు జమ చేయడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేస్తుందని రాయపురాజుపేట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డేడ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం సొసైటీ మహాజన సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.7,65,323.33 ఆదాయాన్ని ఆర్జించిందన్నారు. ఈ మేరకు సంఘ సభ్యుల షేరు ధనంపై ఆరు శాతం వడ్డీని సభ్యులకు పంచడానికి, ఏప్రిల్ నుంచి జూలై వరకు సంఘ జమాఖర్చులను మహాజన సభ ఆమోదించినట్టు చెప్పారు. ఈ ఏడాది ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ రాయితీ సొమ్మును సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేశామన్నారు. సంఘ సభ్యులకు అందచేస్తున్న వివిధ రకాల రుణాలను గురించి వివరించారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘ సభ్యుని భార్య శరగడం అన్నపూర్ణకు ఈ సందర్భంగా లక్ష రూపాయల బీమా సహాయ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు కామాక నూకరాజు, బొడ్డేడ సన్యాసిరావు, పూర్వపు పర్సన్ ఇన్‌చార్జి దాడి సూరి సత్యనారాయణ, సొసైటీ పరిధి గ్రామాల సర్పంచ్‌లు బొడ్డేడ రామునాయుడు, కొరకూటి భోగేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దాడి వెంకటరావు, సంఘ సీఈవో మళ్ల సంతోష్ రావు, సిబ్బంది బొడ్డేడ అప్పారావు, మళ్ల రోహిణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మృతి చెందిన సభ్యుని భార్యకు బీమా చెక్కు అందిస్తున్న దృశ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రామారావు

రావికమతం: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని టి.అర్జాపురం క్లస్టర్ సీఆర్ఎంటీ గుంటూరు రామారావు తెలిపారు. శుక్రవారం అంట్లంపాలెంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల ఒకటి నుంచి 15 రోజుల పాటు పాఠశాలల్లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు భాగస్వాములయ్యేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రామారావు తెలిపారు.

దస్తావేజు లేఖర్ల దోపిడీని అరికట్టాలి

బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ నాగరాజు



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బొట్టా నాగరాజు

నర్సీపట్నం: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దస్తావేజు లేఖర్ల దోపిడీని అరికట్టి, ఆన్‌లైన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బొట్టా నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్లో చలానా కట్టిన తర్వాత కార్యాలయ అధికారులకు చెల్లించాలని క్రయ, విక్రయదారుల నుంచి అదనగా 2 శాతం దస్తావేజులేఖర్లు వసూళ్లు చేస్తున్నారన్నారు. అధికారులతో కుమ్మకై ఈ విధంగా దోచుకుంటున్నారన్నారు. దళారీ వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ కన్వీనర్ గంగాధర్, సూరిబాబు, జగదీష్, స్వామి పాల్గొన్నారు.

139 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: వైద్య సిబ్బంది ఆరోగ్య సూచనలను ప్రజలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రొంగలినాయుడుపాలెంలో 139 మందిని ఆమె పరీక్షించి ఉచితంగా మందులను ఇచ్చారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి నలుగురికి వైద్యం అందించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై ధర్మశ్రీ ఆగ్రహం

వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశం

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో సచివాలయ, రైతు భరోసా, హెల్త్ సెంటర్లు, పాల వెల్లువ భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, అన్ని గ్రామాల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని 22 గ్రామ సచివాలయాల్లో నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయించకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లిస్తున్నా, నిర్మాణాలు వేగవంతం ఎందుకు పూర్తి కాలేదని అసహనం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో భవన నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో డీఈ మోహన్, జేఈ ప్రభు వివరించారు. బిల్లులు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూస్తానని, కాంట్రాక్టర్లు భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వాటిని శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేయాలని విప్ ధర్మశ్రీ సూచించారు. కాంట్రాక్టర్లకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు సహకరించాలన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేటలో అధికారులతో సమీక్షిస్తున్న విప్ ధర్మశ్రీ

వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలకు ఘన సత్కారం

నాతవరం: అంకిత భావంతో పని చేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా సబ్బవరపు వెంకునాయుడు(డి.యర్రవరం), జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సర్పంచ్ ఉలబాల శ్రీనివాస్(శృంగవరం) నియమితులయ్యారు. వీరిని శుక్రవారం నాతవరంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్ రజాక్ ఘనంగా సత్కరించారు. జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించినందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 2న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీపీ, జెడ్పీటీసీ కోరారు. అనంతరం నావతరంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే గణేష్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన దివంగత నేత అంకంరెడ్డి జమీలు విగ్రహాన్ని ఈ నెల 7న ప్రారంభిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



వెంకునాయుడు, శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు

నాతవరం: రాజకీయాలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేసి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ఒకటిన నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులు చర్చించిన పలు అంశాలను ఎమ్మెల్యే గణేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. మిగిలినవి విడతల వారీగా పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నాయకులు ఐక్యంగా ఉంటూ గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే తిప్పికొట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే గణేష్ మంజూరు చేసిన నిధులతో పనులు వేగవంతం చేయాలన్నారు. కొంత మంది పనులు చేయకుండా జాప్యం చేస్తున్నారని, వారంతా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్‌రజాక్, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బవరపు వెంకునాయుడు, కార్యవర్గ సభ్యుడు ఉలబాల శ్రీనువాస్, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ప్రత్యేక కుంకుమార్చన

చోడవరం: మూడో శ్రావణ శుక్రవారం సందర్భంగా అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చోడవరంలో లక్ష్మమ్మతల్లి, దుర్గమ్మ, అంకుపాలెంలో దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక సామూహిక కుంకుమార్చనలు చేశారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. ఉదయం నుంచి అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేయడంతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రోలుగుంట: మూడో శుక్రవారం సందర్భంగా రోలుగుంటలో కనకదుర్గమ్మ ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి వస్త్రాలు సమర్పించుకున్నారు. అభిషేకాలు చేయించుకున్నారు. ఆలయ నిర్మాణకర్త రుత్తల చింతల్లి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మాలధారణ భక్తులు పేడతుల్లు కార్యక్రమం నిర్వహించారు. వీరి దీక్షలు శనివారంతో ముగిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు తెలిపారు.



రోలుగుంటలో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



అంకుపాలెం దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో భక్తులు